'అభయహస్తం' ఇస్తారా..!

ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు **బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు అందని డబ్బులు**



కాట్రపల్లి గ్రామంలో మహిళా సంఘం సభ్యుల సమావేశం(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గత పాలకులు పొదుపు సంఘాలను ఏర్పాటు చేయించారు. ఇవి ఒక్కో అడుగు ముందుకేస్తూ.. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, తదితర రుణాలను పొందుతూ వ్యాపారాలు, ఇతర ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాయి. అందులో భాగంగా 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకం తీసుకొచ్చింది. స్వయం సహాయక సంఘాల్లోని 60 ఏళ్లలోపు మహిళలు ఏడాదికి కొంత డబ్బు జమచేస్తే అరవై ఏళ్ల తర్వాత పింఛన్ అందించేవారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పథకాన్ని రద్దు చేసింది. పథకంలో డబ్బులు కట్టిన వారికి తిరిగి నగదు చెల్లిస్తామని రెండేళ్ల క్రితమే పాలకులు పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడతాయని ఆశగా ఎదురు చూసిన మహిళలకు నిరాశే ఎదురైంది. మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. అప్పుడు పథకాన్ని ప్రారంభించిన పార్టే ఇప్పుడు డబ్బులు ఇస్తుందనే భరోసాతో ఉన్నారు.

అభయహస్తం పథకం అమలు తీరు..

స్వయం సహాయ సంఘాలను మొదటగా వెలుగు పేరుతో ప్రారంభించి అనంతరం ఇందిరాక్రాంతి పథంగా మార్చారు. అందులోనే అభయ హస్తం అనే పథకాన్ని తీసుకువచ్చారు. పథకంలో పేరు నమోదైన మహిళలు ఏడాదికి రూ.365 ప్రీమియం చెల్లిస్తే 60 ఏళ్లనిండగానే ప్రభుత్వం ప్రతినెల రూ.500 పింఛన్ అందించేది. అలాగే అభయహస్తంలో చేరిన మహిళా కుటుంబ సభ్యుల్లో 9, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ చదివే విద్యార్థులు ఉంటే వారికి సంవత్సరానికి రూ.1,200 చొప్పున ఉపకార వేతనాలను ఇద్దరు పిల్లల వరకు చెల్లించేవారు. అభయహస్తం ప్రీమియం డబ్బులు కడుతూ.. సహజ మరణం పొందితే రూ.30 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.70 వేల వరకు అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పింఛన్ మొత్తాన్ని రెట్టింపు చేసి అభయ హస్తం పథకాన్ని నిలిపివేసింది. డబ్బులు జమచేసిన మహిళలకు నగదు చెల్లిస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

మండలాల వారీగా సమాచారం పంపించినా...

ఏడాది క్రితమే అభయ హస్తం లబ్ధిదారుల వివరాలను మండల సమాఖ్యాల ద్వారా ఉన్నతాధికారులకు పంపించారు. కొందరి బ్యాంకుఖాతా సక్రమంగా లేదని చెప్పడంతో తిరిగి మళ్లీ సరిచేసి పంపారు. మృతిచెందిన లబ్ధిదారుల స్థానంలో వారి నామినీల వివరాలను జోడించి పంపించినా ఇంతవరకు డబ్బులు మాత్రం జమకాలేదు. వస్తాయో.. రావో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం



అభయహస్తం పథకంలో మేము చెల్లించిన డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పినా.. ఇంతవరకు ఖాతాల్లో జమ చేయలేదు. వాటి కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తున్నాం. పాలకులు స్పందించి ఖాతాల్లో డబ్బులు జమ చేయించాలి.

–సుద్దాల లక్ష్మి, మహిళా సంఘం సభ్యురాలు, కాట్రపల్లి

ఐదేళ్లు చెల్లించాను



అరవై ఏళ్లు నిండితే ఫించన్ వస్తుందనడంతో అభయ హస్తం పథకంలో ఐదేళ్ల వరకు ప్రీమియం డబ్బులు చెల్లించాను. మధ్యలో పథకం నిలిపివేశారు. కట్టిన డబ్బులు తిరిగి చెల్లిస్తామనడంతో ఆశపడ్డా ఇంతవరకు డబ్బులు రాలేదు.

– గుజ్జ సత్యమ్మ, మహిళా సంఘం సభ్యురాలు, సిర్సపల్లి

• **నేడు మండల సభ**

గంగాధర: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ శ్రీరాం మధుకర్ అధ్యక్షతన నిర్వహించనున్నామని ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

• **ఎన్నికల నిర్వహణపై అవగాహన**

వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎల్‌వో, బూత్‌స్థాయి అధికారులకు తహసీల్దార్ తిర్మల్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 18 ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాస్కర్, కర్ణాకర్, ఆర్‌ఐ నాగరాజు, ప్రత్యూష, ఉన్నారు.

• **పత్తి క్వింటాల్ రూ. 6,670**



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.6,670 ధర పలికింది. మంగళవారం మార్కెట్‌కు 115 వాహనాల్లో 1098 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. మోడల్ రూ. 6,500, కనిష్ఠ ధర రూ.6,000 కాగా గన్నీ సంచుల్లో ఐదుగురు రైతులు 8 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా గరిష్ఠంగా రూ.6,200, మోడల్ రూ. 5,900, కనిష్ఠ ధర రూ. 5,000 ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో సీసీఐ 68 మంది రైతుల నుంచి 958.40 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. గరిష్ఠం రూ. 7,020, మోడల్ రూ.6,995, కనిష్ఠ ధర రూ. 6,714పలికింది. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గగూలోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

కిట్స్‌లో రక్తదాన శిబిరం



రక్తదానంలో అధికారులు, విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం తొమ్మిదవ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ శిక్షణ శిబిరం సమక్షంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. రక్తదానం చేసేందుకు ప్రతి విద్యార్థి స్వచ్ఛందంగా ముందుకురావాలని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలన్నారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ వైద్యాధికారి డాక్టర్ కె.కిషన్ రావు పర్యవేక్షణలో రక్తం సేకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ కె. రవీంద్రబాబు, కమాండింగ్ ఆఫీసర్స్ డేనియల్ లోటోజన్, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులు రాజనర్సయ్య, హుజూరాబాద్ బ్రాంచ్ మేనేజర్ చంద్రప్రకాశ్, మేనేజర్ శంకర్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు శ్రీలత, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, మంగమ్మ పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, నాయకులు

గన్నేరువరం: కేజీబీవీ, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాలకు సంబంధించి మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలను మంగళవారం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేశామని తెలిపారు. ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ అలువాల కోటి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, సర్పంచులు చింతలపల్లి నర్సింహారెడ్డి, ముస్కు కరుణాకర్‌రెడ్డి, దుడ్డు మల్లేశం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, రాజయ్య, బుర్ర మల్లేశంగౌడ్, బుర్ర తిరుపతిగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌సీలకు అభినందనలు

సైదాపూర్: పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లను సైదాపూర్ ఎస్‌ఐ జున్ను ఆరోగ్యం మంగళవారం అభినందించారు. సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మోహన్, సంపత్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు ప్రజాసేవ చేస్తూ మరిన్ని పదోన్నతులు పొందాలని ఎస్‌ఐ ఆకాంక్షించారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అజయ్‌కుమార్



హుజూరాబాద్: పట్టణ ఏబీవీపీ కార్యదర్శి గొసుకుల అజయ్‌కుమార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ నెల 7న ఢిల్లీలో ఏబీవీపీ 69వ మహాసభలు నిర్వహించారు. రాష్ట్రంలో 42వ రాష్ట్ర మహాసభలు నిర్వహించగా అజయ్‌కుమార్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ శాఖ బాధ్యులు ఉత్తర్వులు జారీ చేశారు. రాబోయే రోజుల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ అధికారిగా రాజశేఖర్

సైదాపూర్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న రాజశేఖర్‌ను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం అధికారిగా నియమిస్తూ శాతవాహన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ మనోహర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజశేఖర్ నియామకం పట్ల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని సర్వేనంబర్ 645లోని ప్రభుత్వ భూమిలో గ్రామ పంచాయతీ, పీఏసీఎస్ కార్యాలయాలున్నాయని వీటి పక్కన ప్రభుత్వ భూమిలో కొంతమంది ప్రజాప్రతినిధుల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారి పైపులు వేసి రోడ్డుపోస్తున్నాడని ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని మంగళవారం తహసీల్దార్‌కు ఇల్లందకుంటకు చెందిన దంసాని తిరుపతి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో దంసాని కుమార్, కొమురయ్య పాల్గొన్నారు.

శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు



జమ్మికుంటలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఇల్లందకుంట: అపరభద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వాహక అధికారి కందుల సుధాకర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23న ఉదయం ఐదు గంటల నుంచి వైకుంఠ ద్వారం(ఉత్తరద్వారం) గుండా స్వామివారిని భక్తులు దర్శించుకోవచ్చని జనవరి 11న గోదారంగ నాయకస్వామి కూడారై ఉత్సవం–అమ్మవారి నోము, 14న గోదారంగనాయకుల(ఆండాళ్) కల్యాణమహోత్సవం, స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.1,000 చెల్లించి రశీదు పొందాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆలయానికి విరాళం

చొప్పదండి: పట్టణంలోని వేంకటేశ్వర మణికంఠ ఆలయానికి మంగళవారం ఆర్కిడ్ హాస్పిటల్ యాజమాన్యం రూ.21,000, బోయిన్‌పల్లి మండలం వెంకట్‌రావుపల్లిలోని సాయివెంకటేశ్వర మినరల్స్ క్వారీ యాజమాన్యం రూ. 11,116 విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్, చేపూరి సత్యనారాయణ, ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, ఎన్నం మునీందర్, బత్తిని ప్రశాంత్ పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం

సైదాపూర్: త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక హుజూరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఆకునూర్‌లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను ఉచితంగా పంపిణీ చేస్తూ గీత ప్రచారం చేశారు. ఇందూ సేవా సమితి హుజూరాబాద్ కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాంబాబు, శ్రీదేవి, వంశీ, తిరుపతి, కుమార్, సతీశ్, గోపి, రామస్వామి ఉన్నారు.

రామనామస్మరణతో శోభాయాత్ర..

జమ్మికుంట: రామ జన్మభూమి అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకొని పట్టణానికి చేరకున్న రాములోరి అక్షింతలు, కలశాన్ని పట్టణలోని గీత మందిర్ నుంచి రైల్వే స్టేషన్ శ్రీరామాలయం వరకు పుర వీధుల గుండా వేద పండితులు సంతోష్‌చార్యులు, డింగరి రవికుమార్, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండుగగా జరిగింది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. భజనలు, కీర్తనలు, భక్తుల రామనామస్మరణతో పట్టణ పట్టణం మారుమోగింది. శోభాయాత్ర రామాలయం చేరుకోగానే అక్షింతలు, కలశానికి ప్రత్యేక పూజలు చేసి భద్రపరిచారు. అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన రోజు నుంచి పట్టణంలో ప్రతి ఇంటికి అక్షింతలు భక్తులకు చేరే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశకర్



తిమ్మాపూర్: ఊరేగింపుగా వస్తున్న భక్తులు



చొప్పదండి: క్రిస్మస్ వేడుకల్లో ఉపాధ్యాయులు

తిమ్మాపూర్: అయోధ్యలోని శ్రీరామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలు గ్రామాల్లోని భక్తులందరికీ చేరేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తిమ్మాపూర్ ఖండ సభ్యుడు దరిపెల్లి నర్సింగారావ్ తెలిపారు. కరీంనగర్ నుంచి స్వయం సేవక్ సభ్యుల ద్వారా ఆవుల కుమార్ నేత్రుత్వంలో నుస్తులాపూర్ గ్రామానికి మంగళవారం అక్షింతలను తీసుకువచ్చారు. పంచాయతీ నుంచి శివాలయం వరకు డప్పు చప్పుళ్లు, మంగళహారతులతో గ్రామ పెద్దలు వాటిని నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా తీసుకొచ్చారు. శివాలయంలో ఊరుమడ్ల కిరణ్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు మాట్లాడుతూ అయోధ్యలోని రామ మందిరం నిర్మాణం కోసం ఇంటింటికి తిరిగి నిధి సేకరించిన తరహాలోనే అయోధ్య నుండి వచ్చిన అక్షింతలను ప్రతీ ఇంటికి చేరేలా గ్రామంలోని భక్తులు, వివిధ క్షేత్రాలకు సంబంధించిన ప్రతినిధులు యోజన చేసుకుని అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం ఎంతో మంది కర సేవకులు ప్రాణాలు కోల్పోయారని ఇప్పటికైనా అయోధ్యలో ఆలయ నిర్మాణం పూర్తికావడం హైందవ జాతి చిరకాల కోరిక నెరవేరినట్టేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిగురుమామిడి, గన్నేరువరం మండలాల్లోని వివిధ క్షేత్రాలకు చెందిన నాయకులు, పార్టీలకు చెందిన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహాపడిపూజలో మాజీ ఎమ్మెల్యే

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం అయ్యప్పస్వామి దివ్యనెట్టాంబడి మహాపడి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్..

చొప్పదండి: ప్రతి ఒక్కరూ ఆత్మ విశ్వాసంతో ఆయా రంగాల్లో రాణించాలని బిషప్ ఉడుముల బాల అన్నారు. భూపాలపట్నం శివారులోని మదర్ థెరిస్సా స్కూల్‌లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థి దశలోనే ఆయా అంశాలపై పట్టు సాధించాలన్నారు. క్రిస్మస్ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగోతు వినోద్‌కుమార్, పాదర్ థామస్, శ్రీకాంత్, కిరణ్, డైజో, మార్త, విజయశ్రీ, లిల్లీ, కుర్మాచలం రత్నాకర్ పాల్గొన్నారు.

• **తాళం వేసిన ఇళ్లలో చోరీ**

జమ్మికుంట: తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి జమ్మికుంటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన వివరాలు.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో నకాతి రాజయ్య, పాతరాజు సరిత, గుజ్జుల సుధాకర్, సాలకుల్ల నర్సమ్మ ఇళ్లలో చోరీ జరిగిందన్నారు. నకాతి రాజయ్య ఇంట్లో 12.5 గ్రాముల బంగారం, పాతరాజు సరిత ఇంట్లో 20 గ్రాముల వెండి, 5 గ్రాముల ఉంగరాలు ఎత్తుకెళ్లారని, బాధితుడు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

• **నూతన నియామకం**

కరీంనగర్‌టౌన్: ఆర్యవైశ్య యువజన మహాసభ కరీంనగర్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా కన్న సాయిని నియమించారు. ఈ మేరకు మంగళవారం పట్టణ అధ్యక్షుడు తణుకు సాయికృష్ణ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఆర్యవైశ్య యువజన మహాసభ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన ఆర్యవైశ్య సంఘం బాధ్యుడు రాజేందర్‌కు సాయి కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చొప్పదండి: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గన్నేరువరం: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్–14 విభాగంలో మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన హన్మండ్ల అక్షిత్ ఎంపికైనట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ కోచ్ భక్తు రాజ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని మంకమ్మతోట సిద్దార్థ హైస్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి అక్షిత్ ఈ నెల 13 నుంచి 15 తేదీ వరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడని ఈ నెల 22 నుంచి 25 వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. విద్యార్థి ఎంపిక పట్ల ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ వర్దెల్లి వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీను, ముదిరాజ్ భక్తు రాజ్‌కుమార్, సిద్ధార్థ అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, పీఈటీ లక్ష్మణ్, మాథ్స్ టీచర్ భాస్కర్, బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు హర్షం వ్యక్తం చేశాడు.

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 20 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరుపున విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టుకు 14 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో శ్రీహరి, విష్ణు, శివప్రసాద్, వైష్ణవి, అంకిత, అక్షయ, అంజలిలు, అండర్ 14 విభాగంలో శ్రీకాంత్, అరవింద్, రాహుల్, మారుతి, శ్రీదేవి, గీతాంజలి, శివాని ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, పీడీ కె. కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు ప్లేట్లు, ప్యాడ్‌లు పంపిణీ



తిమ్మాపూర్: విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

తిమ్మాపూర్: మండలంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ, సీహోఈ, ఎంజేపీ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 352 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను గొరిశెట్టి మధురమ్మ ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్ మంగళవారం పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్ల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఏటా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం స్టీల్ ప్లేట్లు, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, అదేవిధంగా విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించి బహుమతులు అందించడంతోపాటు సమాజంలోని పేదలకు వివిధ రకాల సహాయ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పద్మ, కిరణ్‌జ్యోతి, విమల, దేవేందర్ రెడ్డి, గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ఎరడపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం తాడికల్ యూత్ సభ్యులు 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఎండీ అశ్రఫ్ పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు శ్రావణ్, చింటు, సాగర్, సాయిచరణ్, రాయాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



శంకరపట్నం: ఎరడపల్లిలో...

ధరలకు అనుగుణంగా వేతనాలు అందించాలి

• సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్



మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి శంకర్

జమ్మికుంట: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆపరేటర్ ఆల్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... వేతన ఒప్పందకాలం గడువు ముగిసి పది నెలలు గడుస్తున్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి నిబంధనలు పాటించకుండా పని చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు బోనస్ సర్వీసు, పీఎఫ్ సౌకర్యాలు లేకుండా పని చేయించుకుంటూ స్థానిక కార్మికుల ఉపాధిని కొల్లగొడుతున్నారని ఆరోపించారు. మిల్లర్స్ అసోసియేషన్ స్పందించి వేతన ఒప్పందం అమలు చేయని పక్షంలో సార్వత్రిక సమ్మె చేసేందుకు మండల కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఆడెపు రాజనర్సు, బైరం సమ్మయ్య, మండల కార్యదర్శి గడ్డం శోభన్, సభ్యులు పుల్లూరి రాములు, ఇల్లందుల సమ్మయ్య, బీరం సుధాకర్, చేలిక ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ ఆఫీస్ ఎదుట బారులు

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్యాస్ సిలిండర్ రూ.ఐదువందలకే ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీని కోసం ఈ కేవైసీ తప్పనిసరనే పుకారు ఊపందుకోవడంతో మానకొండూర్ మండల కేంద్రంలోని భారత్ వంటగ్యాస్ కార్యాలయానికి మహిళలు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ కేవైసీకి వేచి చూశారు. గ్యాస్ నిర్వాహకులు ఈ కేవైసీ కోసం ఇక్కడికి రానవసరం లేదని, ఇంటివద్దకే సేల్స్ బాయ్ వస్తాడని, అక్కడే ఈ కేవైసీ చేస్తాడని చెబుతున్నా మహిళలు వినకపోవడంతో నిర్వాహకులకు తలనొప్పిగా మారింది.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శ



హుజూరాబాద్: పట్టణంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందినవారి కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వెంట బండ శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, నాయకులు, తదితరులు ఉన్నారు.